# మృత్యోర్మా అమృతంగమయ

రెండు వారాలపాటు కిటకిటలాడిన ఇల్లు నీరసించి, నిశ్శబ్దాన్ని గంపకెత్తుకొంటోంది. పక్షులు చెదిరిపోయినట్లు ఎక్కడివాళ్లు అక్కడికి వెళ్లిపోయారు. పెద్దలచావు పెళ్లితో సమానం అన్నారంతా. ఆ పాత ఇంట్లో, ఆ గ్రామంలో నేనే ఆలుబిడ్డలతో మిగిలిపోయాను. వీధి గడపలో నిండుగా కూర్చొని చంటి మనవణ్ణి బొజ్జమీద పెట్టుకొని, 'చేత వెన్నముద్ద చంగల్వపూదండ' అంటూ తియ్యని పలుకు నేర్పే నా తండ్రి ఇకలేడని రాజీపడడానికి మనసు మొరాయిస్తోంది. బరువెక్కిన ఆలోచనల్లోంచి మనసును మళ్లించడానికని చేత్తోసంచీ పుచ్చుకుని అంగడికి పోతూ "ఏమైనా తేవాలా?" అన్నాను అర్ధాంగివేపు చూసి. చిత్రంగా జవాబు అనుకోని దిశనుంచి అడక్కుండానే వచ్చింది. నోట్లో ఉన్న బొటనవేలు తీసి "తాతకావాలి" అన్నాడు అర్ధనగ్నంగా కిటికీలో కూర్చున్న నా ఆఖరివాడు చిరంజీవి. నేనూ, నాభార్యా 'అవాక్కయిపోయాం ఓ క్షణం. వాడికి కావలసిన వస్తువు అంగడిలో ఎక్కడ దొరుకుతుంది? "ఏమీ తేవద్దుకానీ కాస్త ఇవాల్టికి ఇంటిపట్టునే ఉండి వాణ్ణి చూసుకోండి. మన హడావిడిలో వాణ్ణెవరం పట్టించుకోలేదు పన్నెండు రోజులై" అంది నా భార్య.

వాడికొక లాగు తొడిగి అలా ఇంటికి దగ్గరగానే వున్న మర్రికుంటవేపు తీసుకుపోయాను. అక్కడ పగిలిన రాతి చప్టా మీద కూర్చుని 'అనగా అనగా నక్కా కాకీ' అంటూ ఏదోకథ చెప్పబోయాను. "ఛీ అలా కాదు. తాత అలా చెప్పలేదు" అని నా టెక్నిక్‌నే తిరస్కరించాడు. ఇంకా వాడు తాత జ్ఞాపకాల్లోంచి తేరుకోలేదని తెలుసుకున్నాక ఎంతో జాలి వేసింది. జనన మరణ చక్రం అనాదిగా తిరుగుతున్నా ఎప్పటికప్పుడే పరగడుపుగా ఉంటుంది. నేనుగతంలోకి తొంగిచూస్తూ నా చంటివాడికన్నా ఎంత అదృష్టవంతుణ్ణో అనుకున్నాను.

నా నాలుగేళ్లు నిండిన బాల్యంలో అమ్మ ఒక మారు "మాసిన బట్టలు పేరుకుపోయాయి. అచ్చమ్మ రావడంలేదు, పోయి పిల్చుకురా" అంటే మా వీధికి దగ్గరగానే ఉన్న గుడిసె వేపు వెళ్లాను. చాకిబానలా ఉండే కడుపుతో మా ఇంటికి వచ్చే అచ్చమ్మ లేత అరిటాకులా ముడుచుకు పడుకుంది నులకమంచమ్మీద. దాని పక్కనే ఎర్రగా చిన్నపిల్లాడు. వాడి

బుచ్చిచేతులూ, వేళ్లూ, కాళ్లూ పాదాలుచూస్తూ నేవెళ్లిన పని మరిచిపోయాను. తిరిగి ఇంటికి వెళ్లకుండా ఆ శిశువుని చూస్తూ ఉండిపోతే మా తాతయ్య వెతుక్కుంటూ వచ్చాడు.

తాత ప్రశాంతంగా నిద్రలోనే కళ్లుమూసుకుని కాలగర్భంలోకి జారుకున్న నాటికి నాభార్య కాపురానికి వచ్చేసింది. దుఃఖంతో నేను కళ్లు తుడుచుకుంటూ ఉంటే "అబ్బో ఎంతాశ. ఇంకా మీ తాత మీ కోసం ఉండాలేం. అరముగ్గి రాలిపోయారు. అదృష్టవంతులు" అని చిత్రంగా నవ్వింది. హాస్యమో, ఓదార్పో తెలియని ఆ నవ్వులో ఉన్న వాస్తవిక తత్త్వం నన్నొక క్షణం అలా నిలబెట్టేసింది...

ఇంతలో దూరాన పచ్చగడ్డిలో ఏదో ఆకర్షణకిలోనై నా ఒడిలో ఉన్న చిరంజీవి అలా కాసింత దూరం వెళ్లాడు. నా అంతరంగం మాత్రం గతాన్ని తోడిపోస్తోంది. నేను అచేతనంగా చప్టామీద అలా కూర్చున్నాను.

తెలతెలవారే వేళ పొడిదగ్గూ చేతికర్ర చప్పుడూ చెవిని పడగానే తాతను మెల్లమెల్లగా వెంబడించేవాణ్ణి. ఆ ప్రయాణం ఎంతో దూరంకాదు. ఇంటికి ఉత్తరాన ఉన్న మర్రికుంట దిశగా సాగేది. తాత నన్ను చూడకుండా పోతూ ఉంటే అవమానభారంతో ఏడుపు నా ఆయుధం. తాత వెనక్కు తిరిగి "ఓరి భడవా ఇంత పెందరాళే ఎందుకు లేచావురా?" అని ఆగి చిన్న చిన్న అంగలు వేస్తూ తనతో తీసుకుపోతూ వుంటే ఎంత విజయగర్వమో. మర్రిచెట్టుకింద ఆ రాతి చప్టా మీద కూర్చుని తాత ఉషోదయాన్ని చూస్తూ ఏవో వింత శబ్దాలు ఉచ్చరిస్తూ అసతోమా... తమసోమా అంటూ కళ్లుమూసుకుంటే నేనలా అర్థంకాక చూసేవాణ్ని? ఇంటికి వచ్చి నోరు తిరగని ఆ శబ్దాల్ని అనుకరించి నాన్నమ్మ ముందు వల్లించే ప్రయత్నంచేస్తే ఆమె పొంగిపోయి చిలుకుతున్న పెరుగులోంచి అప్పుడే తీసిన వెన్నముద్ద చేతిలో తాయిలంలా పెట్టేది. అర్థంకాని ఆ శబ్దాల్లో ఏదో వింత ఆకర్షణ ఉండేది. చాతీ విరుచుకుని కాలాన్ని సవాలుచేస్తున్న వస్తాదులా నిలబడ్డ ఆ మర్రిచెట్టు కింద తాతకు దగ్గరగానే తిరుగాడుతూ ఎన్ని ఉషోదయాలు, ఎన్ని సాయంసంధ్యలు లెక్కపెట్టానో నాకు జ్ఞాపకంలేదు. ఎన్నికథలు, ముచ్చట్లు, జీవితసత్యాలు విన్నానో. ఆ చెట్టుకింద తాత కూర్చుంటే ఏదోసందేహాన్ని తీర్చుకోందే, ఒక నమస్కారం చెయ్యందే ఏ గ్రామస్తుడూ అటుగా పోయిన జ్ఞాపకంలేదు. అలాటి సమయంలో తాత కళ్ళలో ఏదో వాత్సల్యం,ఎదుటి వాళ్లలో ఏదో తృప్తి కనిపించేది. నా మనస్సులో వింత వింత భావాలు కదిలేవి. వాటికి రూపమివ్వడానికి నా దగ్గర మాటలేవీ?

సాయంత్రం వేళ ఆ మర్రికొమ్మల్లో,రెమ్మల్లో ఎంత కలకలమో,ఎంత సందడో చెప్పలేం. మర్రిచెట్టు మనిషై విరగబడి నవ్వుతున్నట్లనిపించేది. "ఎందుకు తాతా ఆ పిట్టలు అలా గోలచేస్తాయి" అని నేనడిగితే "పిల్లల్ని చూసుకున్న సంతోషం తల్లుల్నీ, తల్లుల్ని

చూసుకున్న సంతోషం పిల్లల్లీ" అని చెప్పి ప్రేమతో నా వీపు నిమురుతూ, నికిప్పుడేం అర్థమౌతుందిరా అన్న ధోరణిలో నవ్వేవాడు.

తాతపోయిన ఏడాదికే వచ్చిందొక పెద్ద తుఫాను. ఇంటికప్పుల్నే ఎగరేసుకుపోయేటంత గాలి. పొలాల్నీ రోడ్లనీ ఏకంచేసిన వాన. ఆ గాలివాన అంత మర్రిచెట్టునూ వేళ్లతో పెకిలించి పడేసింది. వేలంపాటలో ఆ చెట్టును పాడుకున్న గుత్తదార్లు రెండునెలల్లోనే గొడ్డళ్లతో కొట్టించి పెద్ద పెద్ద దుంగల్ని లారీలమీదా, బళ్లమీదా పట్టుకుపోయారు. ఇంటి కిటికీలోంచి చూస్తే మర్రిలేని ఆ మర్రికుంట ప్రాంతమంతా బోసిపోయింది. పొలం నుంచి వచ్చేపోయే వేళల్లో ఆ రాతిచప్టా మీద కూర్చొని రావడం కొంత నా మనసుకి ఊరట కలిగించేది. అలాటి ఒక సాయంత్రం ఆ పెద్దమర్రికి అవశేషంలా మిగిలిపోయిన ఒక చిన్న దుంగను గడ్డిలో ఒక మూల చూసి ఆశ్చర్యపోయాను. చిన్నదన్ననిర్లక్ష్యంతోనో మరుపువల్లో దాన్ని వదిలిపోయినట్లున్నారు. ఎండకెండి వానకి తడిసి చివికిపోతున్న ఆ దుంగను వడ్రంగిపిట్టలు విడవకుండా పొడిచిపోయేవి. ఎప్పుడైనా నేను కిటికీలోంచి శూన్యంగా ఉన్న ఆ మర్రికుంట దిశగాచూస్తూ నిలబడితే "తాత కనిపిస్తూ ఉంటారేమో" అని ఛలోక్తి విసిరేది నా భార్య...

"ఎన్ని గొడుగులో... బుచ్చిగొడుగులు" అని చిరంజీవి తన చిన్ని అరచేతులు కలిపి తప్పట్లు తట్టి నన్ను నా జ్ఞాపకాల వలయంలోంచి వర్తమానంలోకి లాక్కువచ్చాడు. అటుగా వెళ్లి చూశాను ఉత్కంఠతో. ఆ చివికిపోయిన చిన్నమర్రిదుంగలో ఎన్నో పుట్టగొడుగులు. వాటి మధ్య ఒక నునులేత మర్రిమొలక నవనవలాడుతూనవ్వినట్లుంది. ముచ్చటగా మూడు లేత ఆకులు తొడిగింది. ఉషోదయ సమయంలో తాత వినిపించే వింత శబ్దాలకు ప్రతీకల్లా ఉన్నాయి. మృత్యోర్మా... అన్నమాటలకి వింత అర్థం లీలగా స్ఫురిస్తోంది. ఇదేమీ పట్టించుకోని నా చిరంజీవి చైతన్యంతో గంతులేస్తూ ఆ మర్రిదుంగ చుట్టూ ప్రదక్షిణచేస్తూనే ఉన్నాడు.

(ఈనాడు ఆదివారం, 30-5-1993)